క్లుప్తంగా

వసతి గృహం తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామం ఎస్సీ బాలికల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని శనివారం ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి తనిఖీ చేశారు. స్టాక్ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడిన ఎంపీడీఓ మౌలిక వసతులపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేష్ పాల్గొన్నారు.

మద్దూరు పీహెచ్‌సీని తనిఖీ



మందులను తనిఖీ చేస్తున్న డీఐఓ ప్రసన్న లక్ష్మీ

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు పీహెచ్‌సీని శనివారం డీఐఓ ప్రసన్న లక్ష్మీ తనిఖీ చేశారు. మందుల నిల్వలు, ఇతర రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్య పరచాలని వైద్య సిబ్బందికి సూచించారు. సకాలంలో ప్రజలకు అందించాల్సిన టీకాలు వేసే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీతా, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుజాడ సేవలు చిరస్మరణీయం



గురుజాడకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో గురుజాడ వెంకట అప్పారావు చేసిన సేవలు చిరస్మరణీయమని గ్రంథాలయాధికారిని కౌసల్య అన్నారు. గురుజాడ 109వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం నన్నూరు శాఖ గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని ఈ సందర్భంగా కౌసల్య సూచించారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కల్లూరు: చెత్త నుంచి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం ఆయన ఉలిందకొండ గ్రామంలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని (ఎస్‌డబ్ల్యూపీసీ) పరిశీలించారు. ఎంపీడీఓ, ఈఓఆర్డీ నాగేష్‌తో కలసి ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని రెండు సచివాలయాలను సందర్శించారు. రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. హౌస్ హోల్డ్ సర్వే, ఎన్‌పీసీఐ, ఎంఎస్ఎంఈ సర్వేలు త్వరగా పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీఓ సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోడుమూరు రూరల్: రాష్ట్ర స్థాయి పోటీల్లో గూడూరు మండలం పెంచికలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. శ్రీకాకుళంలో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెట్ అండర్-17 పోటీల్లో శంకర్ ప్రతిభ కనబరిచారని హెచ్ఎం సాయిలీల తెలిపారు. అలాగే విజయవాడ లో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీల్లో లోకేష్ అండర్-17లో జమిలా, అండర్-17 ట్రాక్ రైడ్ పోటీల్లో శహీద్ ఉత్తమ ప్రతిభ కనబర్చారని చెప్పారు. ఈ మేరకు శనివారం ఆ విద్యార్థులకు హెచ్ఎంతో ఉపాధ్యాయులు జాకీర్ బేగ్, విజయ్ కుమార్, అనురాధమ్మ,శ్రీదేవి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

తప్పిన ప్రమాదం

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు ప్రమాదం తప్పింది. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జిల్లా వ్యవసాయ అధికారులకు సమావేశం నిర్వహించారు. సమావేశం ముగిశాక కోవెలకుంట్ల ఏఓ నిరంజన్ కారు స్టార్ట్ చేయగా ఒక్కసారిగా ముందుకు దూసెళ్లింది. పక్కనే ఉన్న ట్రీగార్డ్‌తోపాటు పంచాయితీ కార్యాలయ మరుగుదొడ్డిని ఢీకొని ఆగిపోయింది. అయితే కారులో ఉన్న ఏఓతోపాటు సిబ్బందికి ఏ మాత్రం గాయాలు కాలేదు. దీంతో ఊపిరిపీల్చుకున్నారు.

భవన నిర్మాణాలపై నీలినీడలు

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు
- పూర్తయిన భవనాలను సైతం పట్టించుకోని వైనం
- కూటమి ప్రభుత్వ తీరును తప్పుపడుతున్న గ్రామీణులు



బురాన్‌దొడ్డిలో చివరిదశలో ఆగిపోయిన విలేజ్ హెల్త్ క్లీనిక్ భవన నిర్మాణం



సంగాలలో ఆగిపోయిన సచివాలయ భవన నిర్మాణ పనులు

సి.బెళగల్: ప్రజల వద్దకే పాలన లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ప్రభుత్వ భవన నిర్మాణాలను ప్రారంభించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణాలు చేపట్టింది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఈ మేరకు ప్రజలకు నేరుగా సేవలు అందజేశారు ఉద్యోగులు. మండల కేంద్రాలకు వెళ్లకుండా స్వగ్రామంలోనే అన్ని సేవలు అందాయి కూడా. అయితే అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వలంటీర్లను ప్రజా సేవకు దూరం పెట్టిన కూటమి సర్కార్ సచివాలయ సేవలను దూరం చేసేలా వ్యవహరిస్తున్న తీరును అన్నివర్గాల ప్రజలు తప్పుపడుతున్నారు. అక్కడక్కడ నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణాలను పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో భవన నిర్మాణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. అదేవిధంగా పూర్తయిన భవనాలను సైతం వినియోగంలోకి తేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రాలకు వెళ్లే పాతరోజుల కష్టాలు మళ్లీ తప్పేలా లేవని ఆవేదన చెందుతున్నారు గ్రామీణులు.

మండలంలో పరిస్థితి ఇలా...

మండలంలో 16 గ్రామ సచివాలయాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఒక్కొక్కటి రూ.40 లక్షల వ్యయంతో 16 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వ హయంలోనే కొత్తకోట, ఈర్లదిన్నె, బురాన్‌దొడ్డి, పోలకల్ 2, పోలకల్ – 3, సి.బెళగల్ – 2, కంబదహాల్, చింతమానుపల్లె గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలు పూర్తి కావడంతో ప్రజలకు సేవలు సైతం అందాయి. అయితే గొల్లలదొడ్డి, ముడుమాల గ్రామాల్లో స్థల వివాదంతో నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయింది. ఇనగండ్ల, సి.బెళగల్ – 1, పోలకల్ – 1, బ్రాహ్మణదొడ్డి, కొండాపురం గ్రామ సచివాలయాల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. సంగాల గ్రామంలో పునాది దశలోనే నిర్మాణం ఆగిపోయింది. అదేవిధంగా రూ.21.80 లక్షల వ్యవయం చొప్పున మండలంలో 15 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. మూడు (సి.బెళగల్ – 2, బురాన్‌దొడ్డి, పోలకల్ – 3) ఆర్బీకేలు గత ప్రభుత్వంలోనే ప్రారంభమై రైతులకు సేవలను అందిస్తున్నాయి. అయితే ఈర్లదిన్నె, ఇనగండ్ల భవన నిర్మానాలు పూర్తవగా ప్రారంభానికి నోచుకోలేదు. మిగిలిన పది గ్రామాల్లో భవన నిర్మాణాలు వివిధ దశలలో ఆగిపోయాయి. అదేవిధంగా మండలంలో రూ.17.50 లక్షలతో 13 హెల్త్ క్లీనిక్‌లు మంజూరు కాగా, కేవలం మూడు (బురాన్‌దొడ్డి, పోలకల్ – 2, కొత్తకోట) గ్రామాల్లో నిర్మాణాల్లో పూర్తి అవ్వగా, పది గ్రామాల్లో పనులను ప్రారంభ దశ నుంచి లెంటల్ లెవల్లో నిలిచిపాయాయి. అయితే వీటి నిర్మాణాలపై ఏ మాత్రం కూటమి సర్కార్ చర్యలు తీసుకోవడం లేదు. బురాన్‌దొడ్డి, పోలకల్ – 2, కొత్తకోట గ్రామాల్లో హెల్త్ క్లీనిక్ భవన నిర్మానాలు పూర్తయినా కూటమి ప్రభుత్వం చిన్న చూపుతో ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో గ్రామీణులకు నేరుగా సేవలు అందజేసే సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కొండాపురంలో నిర్మాణం పూర్తయినా వినియోగంలోకిరాని సచివాలయం

ప్రభుత్వం చొరవ చూపాలి

గ్రామాల్లో సచివాలయాల ద్వారా ప్రజలకు స్థానికంగానే సేవలు అందుతాయి. మా గ్రామంతో పాటు ఇతర పల్లెల్లో సచివాలయ, ఆర్ఎస్‌ఏ, హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణాలు ప్రభుత్వ మార్పుతో మధ్యలో ఆగిపాయాయి. ప్రభుత్వం పల్లె ప్రజలకు సేవలందించే భవన నిర్మాణాలు పూర్తి చేసేందుకు సర్వత్రమే చొరవ చూపాలి.

–హనుమంతు, సర్పంచ్, సంగాల

నూతన భవనాలను వినియోగంలోకి తేవాలి

గత ప్రభుత్వ హయంలో గ్రామాల అభివృద్ధి, పేదలకు ప్రభుత్వ సేవలను అందుబాటులోకి వచ్చేలా చర్యలు ఉండేవి. గతంలో నిర్మాణాలు పూర్తి అయిన ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి వచ్చేలా ఇప్పటి ప్రభుత్వం చూడాలి. పల్లెల్లో నిర్మాణాలను పూర్తి అయిన సచివాలయాలను, హెల్త్ క్లీనిక్‌లను అధికారులు పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలి. అప్పటిలాగానే గ్రామీణులకు పల్లెలోనే అన్ని రకాల సేవలను గ్రామాలలోని ప్రభుత్వ భవనాలలోనే అందించాలి.

–శంకర్‌రెడ్డి, కొండాపురం గ్రామం

ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి

గతంలో ప్రారంభమైన అన్ని గ్రామ సచివాలయాల్లో, రైతు సేవా కేంద్రాలలో ప్రజలకు ఎప్పటిలాగానే సేవలు అందుతున్నాయి. కొన్ని గ్రామాల్లో నూతన భవనాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అయితే మరికొన్ని మాత్రం చివరి దశలో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. చివరిదశలో పెండింగ్‌లో ఉన్న భవన నిర్మానాలను పూర్తి చెయ్యాలన్నది ప్రభుత్వ పరిశీలనలో ఉంది. –వెంకటప్రకాష్, పీఆర్‌ఏఈ, సి.బెళగల్ మండలం

గృహాలు త్వరగా నిర్మించుకోండి



చెంచులతో మాట్లాడుతున్న డీటీడీఏ పీఓ వెంకటశివప్రసాద్

పాణ్యం: గృహాలు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని ఐటీడీఏ పీఓ వెంకటశివప్రసాద్ సూచించారు. శనివారం పాణ్యం చెంచుకాలనీ వాసులతో అయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ కాలనీలో 366 కుటుంబాలు ఉండగా 167గృహాలు మంజురు అయ్యాయన్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ. 2.39లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇళ్లు లేని వారు త్వరగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలన్నారు. అదేవిధంగా గిరిజనుల కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిందడ్రులు పిల్లలను తప్పకుండా బడికి పంపాలన్నారు. అదేవిధంగా గతంలో మంజురై నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. లబ్దిదారులతో మాట్లాడి త్వరగా గృహాలను కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ హరిగోపాల్, డీఈ విజయ్‌బాబు, ఏఈ శ్రీనివాసులు, సర్పంచ్ మేకల పల్లవి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రీమియం చెల్లింపుపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న మురళీకృష్ణ

పాణ్యం: రైతులే పంటల బీమా ప్రీమియం చెల్లించుకునేలా అవగాహన కల్పించాలి నంద్యాల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సంబంధిత అధికారులకు సూచించారు. పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వ్యవసామ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల బీమాకు సంబంధించి నిర్ణయించిన ప్రీమియం మొత్తాన్ని రైతులు ఆయా ఆర్‌బీకేలో చెల్లించేలా చూడాలన్నారు. అలాగే రబీలోనే కౌలు రైతులకు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రబీలో ఈ–క్రాప్ బుకింగ్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాగు పొలాలు ఖాళీగా ఉంచరాదని, రైతులను చైతన్య పరిచాలని సూచించారు. డివిజన్‌ల వారిగా సాగు వివారాలు, సాగునీటి వనరులు, సాంప్రదాయ నీటి వనరులు, ఆయకట్టు తదితర అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీలు రాజశేఖర్, నంద్యాల ఏడీ రాజశేఖర్, ఏఓలు తదితరులు పాల్గొన్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థుల అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అపార్ నమోదుపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని తప్పులు లేకుండా చూడాలన్నారు. మండలంలో 11,136 మంది ఉండగా, ఇప్పటి వరకు 7,967 మందికి మాత్రమే అపార్ నమోదు చేశారని, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా 7వ తేదీన పాఠశాలలో నిర్వహించే తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం



కళాకారులకు చెక్ అందజేస్తున్న మంత్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: సూపర్ సిక్స్ పథకాలను దశల వారీగా అమలు చేస్తామని మంత్రులు జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్ స్పష్టం చేశారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా శనివారం కాల్వబుగ్గలో టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో వనభోజన మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రులతోపాటు పాణ్యం, నందికొట్కూరు, శ్రీశైలం ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, గిత్తా జయసూర్య, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి, మండల మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయభారతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఓర్వకల్లులో పారిశ్రామిక హబ్ అభివృద్ధి కోసం రూ.3,200 కోట్లు మంజూరు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు. తమ కృషివలనే హైకోర్టు బెంచ్‌ను సీఎం చంద్రబాబు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నందికొట్కూరు లాస్యశ్రీ ప్రదర్శించిన కూచిపూడి నాట్య ప్రదర్శనకు మెచ్చి మంత్రి జనార్దన్‌రెడ్డి రూ.50 వేలను బహూకరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

మహిళలు స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమేష్‌కుమార్

పాణ్యం: విద్యార్థినులు, మహిళలు స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలని, లైంగిక వేధింపులు, దాడులను ధైర్యంగా నిలదీయాలని నంద్యాల మహిళా పోలీసు స్టేషన్ సీఐ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా సాధికారత కార్యక్రమంలో భాగంగా లైంగిక వేధింపల నిరోధక కమిటీ (ఇంటర్నల్ కంప్లేట్ కమిటీ) ఆధ్వర్యంలో స్వీయ రక్షణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల రక్షణకు కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అత్యసవర సమయాల్లో 112, 1930 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ధనమ్మ, డీన్ రామిరెడ్డి, కో–ఆర్డినేటర్ డాక్టర్ హరిత, డాక్టర్ సుధామాధురి, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కోడుమూరు సీఐ తబ్రేజ్



వర్కూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్ : చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కోడుమూరు సీఐ తబ్రేజ్ సూచించారు. పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి కోడుమూరు ఎస్సీ కాలనీలో చట్టాలపై కాలనీవాసులకు సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాముడు, డీటీ రామాంజినేయులు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రసాదించిన హక్కులపై ఎస్సీ, ఎస్టీలు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాజంలో ఎవ్వరైనా మిమ్మల్ని కించపరిస్తే చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. అలాగే అంటరాని తనానికి గురవుతున్నా, ఎవ్వరైనా చిన్న చూపు చూస్తున్నా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. ఎస్ఐ, ఎంపీడీఓ, డీటీలు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎస్సీ,ఎస్టీల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయని, సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలన్నారు. ఎస్సీ, ఎస్టీలు తమ పిల్లలను చక్కగా చదివించుకోవాలని, అప్పుడే సమాజంలో మంచి గుర్తింపుతో పాటు, భవిష్యత్ బాగుంటుందని వివరించారు.

వర్కూరులో ఎస్ఐ పల్లెనిద్ర

కోడుమూరు రూరల్ : మండల పరిధిలోని వర్కూరు గ్రామంలో శనివారం రాత్రి ఎస్ఐ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. అనంతరం గ్రామ ప్రజలతో ఎస్ఐ సమావే శమయ్యారు. సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామస్తులు ఐకమత్యంగా మెలగాలని, అప్పుడే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు పెద్దల సమక్షంలో సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అప్పటికీ ఇరువర్గాలు సమ్మతించకుంటే పోలీసులను ఆశ్రయించాలే తప్పా ఘర్షణలకు పాల్పడ కూడదన్నారు.

పది విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోడుమూరు రూరల్ : పదవతరగతి విద్యార్థులు ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని డీఈఓ శామ్యూల్ సూచించారు. శనివారం కోడుమూరులోని బాలురు, బాలికల హైస్కూళ్లను డీఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలపై భయం వీడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

మెగా పేరెంట్స్‌డేకు తల్లిదండ్రులు హాజరుకావాలి

డిసెంబర్ 7న ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే మెగా పేరెంట్స్ డే కార్యక్రమానికి విద్యార్థుల తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలని డీఈఓ శామ్యూల్ సూచించారు. అంతకుముందు డీఈఓ....ఎంఈఓ తైమూర్‌బాషా, స్థానిక విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి వెళ్లి మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు రావాల్సిందిగా ఓ విద్యార్థి తల్లిదండ్రులను ఆహ్వానించారు.

మహాసభలను జయప్రదం చేయండి

కల్లూరు: కర్నూలు నగరంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాలలో ఆదివారం నిర్వహించే కర్నూలు న్యూ సిటీ నగర మూడవ సభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు రాముడు, సాయిబాబా, నరసింహులు, సుధాకరప్ప పిలుపు నిచ్చారు. కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవ లంభిస్తున్న ప్రభుత్వాలపై నిర్వహించే ఉద్యమాలపై సభలో చర్చిస్తామన్నారు. అదేవిధంగా కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో సోమవారం సాయంత్రం భారీ బహిరంగ సభ ఉంటుందని, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

బీజేపీ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలి



పట్టణంలో ముస్లిం పెద్దలకు కరపత్రాలను అందజేస్తున్న ఆవాజ్ కమిటీ నాయకులు

కోడుమూరు రూరల్ : బీజేపీ ముస్లిం వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ.ముస్తఫా పిలుపునిచ్చారు. ఈ మేరకు గూడూరు పాతబస్టాండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను ముస్లిం పెద్దలకు సభ్యులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వక్ఫ్ భూములను రక్షించి ముస్లిం మైనార్టీలను అభివృద్ధి పథంలో నడిపించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా తమ బాధ్యతను విస్మరించాయన్నారు. బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా అనేక చట్టాలు, బిల్లులను తెచ్చిందని, వీటిని ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ నాయకులు ఖాజీ ఇశాక్, మొహమ్మద్, హుసేన్ పీరా, ఖాజా, బడేసా, హుసేనప్ప, అజీజ్, రఫీక్, బుల్లేట్ బాషా, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం




పదవి విరమణ పొందిన ఎంఈఓ విమల వసుంధరదేవితో ఉపాధ్యాయులు

గడివేముల: ఎంఈఓ వసుంధర దేవి పదవీ విరమణ పొందారు. ఈ మేరకు శనివారం స్థానిక జెడ్పీ గ్రౌండ్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆమెకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా పూర్వ విద్యార్థులు(1978 బ్యాచ్) వసుంధర దేవికి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. వసుంధర దేవిసేవలను డిప్యూటీ డీఈఓతోపాటు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టరీ ఇమ్మానియేల్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మహేశ్వర్ రెడ్డి, అబ్దుల్ రావూఫ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులు, నాగన్న, దస్తగిరమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సి.బెళగల్: సైబర్ నేరాలు మితిమీరాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ తిమ్మారెడ్డి సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సైబర్ నేరాలకు సంబంధించిన పోస్టర్లను రెవెన్యూ అధికారులతో కలిసి వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ అత్యాస, అశ్రద్ధ, వ్యామోహాలతో చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు అధికమయ్యాయని, ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, రీ సర్వే డీటీ వెంకటేశ్వర్లు, ఏఎస్ఓ ఆదినారాయణ, ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద రస్తాపై అధికారులు విచారణ



బ్యాతోలిలో కాలువగట్టు రస్తాను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండలంలోని బ్యాతోలి గ్రామంలో కాలువ గట్టుపై నెలకొన్న రస్తా వివాదంపై శనివారం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్ అధికారులు విచారణ చేపట్టారు. బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గొల్ల వెంకటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులకు బ్యాతోలి గ్రామ శివారులో సర్వే నెంబర్ 660/4. 660/2బీలో దాదాపు ఎకర వ్యవసాయ పొలం ఉంది. పొలానికి తుంగభద్ర ప్రాజెక్ట్ లో లెవల్ కెనాల్ (టీబీపీ ఎల్ఎల్‌సీ) గట్టు రస్తాపై వెళ్లే వారమని, అయితే బ్యాతోలి గ్రామానికి కొంతమంది కాలువ గట్టును ఆక్రమించుకుని తమను అడ్డుకుంటున్నారని గొల్ల వెంకటేశ్వరమ్మ కుటుంబ సభ్యులు హై కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఇరిగేషన్ డీఈ సుబ్బారాయుడు, ఎస్ఐ తిమ్మారెడ్డి తదితరులు కాలువ గట్టును పరిశీలించారు. వివరాలను నమోదు చేసుకున్నారు. సమగ్ర నివేదికను కోర్టు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. విచారణలో ఇరిగేషన్ ఏఈ సూర్యప్రకాష్, మండల సర్వేయర్ నాగభూషణం, వీఆర్వో అలీఫ్, సర్వే సహాయకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com